క్లుప్తంగా

సకాలంలో సాగునీరు అందిస్తాం



పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఏఈఈలు

జి.సిగడాం: ఈ ఖరీఫ్ సీజన్‌లో మడ్డువలస కాలువ ద్వారా రైతులకు సకాలంలో సాగునీరు అందిస్తామని ఆ శాఖ ఏఈఈ రాజశేఖర్ తెలిపారు. బుధవారం మడ్డువలస ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న జి.సిగడాం మండలం పెంట గ్రామంలో ప్రధాన కుడి కాలువలో పేరుకుపోయిన పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ సెంటు భూమికి సాగునీరు అందించేందుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. ఆయనతో పాటు నాణ్యతా ప్రమాణాల శాఖ ఏఈఈ కె.విశ్వనాథం, రైతులు మక్క నారాయణరావు, మీసాల రమణ, మీసాల సూరిబాబు తదితరులు ఉన్నారు.

రూ.50 వేల విరాళం అందజేత



చెక్ అందజేస్తున్న నారాయణప్రసాద్ దంపతులు

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో నిత్యాన్నదాన పథకానికి శ్రీకూర్మం గ్రామానికి చెందిన బరాటం నారాయణప్రసాద్, అనిత దంపతులు రూ.50 వేల విరాళం బుధవారం అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఈవో కె.నరసింహనాయుడుకు చెక్ అందించారు.

130 మందికి కంటి పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

రణస్థలం: గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ఇడదాసుల సేవా ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు ఇడదాసుల వెంకట సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని సూర్య ఆస్పత్రి ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఇడదాసుల విద్యా ఆరోగ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 56 మందికి ఆపరేషన్ అవసరమని వైద్యులు చెప్పడంతో శంకర్ ఫౌండేషన్ బస్సులో విశాఖపట్నం తరలించారు. కార్యక్రమంలో డాక్టర్ యశ్వంత్, సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఇడదాసుల తిరుపతిరాజు, శంకర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయి విగ్రహావిష్కరణ



ఝాన్సీ లక్ష్మీబాయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి నేటి మహిళలకు ఆదర్శనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు అన్నారు. నగరంలోని మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఆమె విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైడి వేణుగోపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సూర్యారావు, విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో చీడపీడల నివారణ



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సోంపేట: ఖరీఫ్ సాగు చేసే రైతులు వరి విత్తనాలను శుద్ధి చేయడం వలన చీడపీడలు నివారించవచ్చునని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. పలాసపురంలో రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విత్తనశుద్ధితో అగ్గి తెగులు, పొడ తెగులను అరికట్టవచ్చునని పేర్కొన్నారు.

వితరణ

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు పూర్వ విద్యార్థి వంశీ తండ్రి వెంకటరమణ స్టీల్ ప్లేట్లు వితరణ చేశారు. ప్లేట్లును కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పవన్‌కు అందించారు. వంశీ తండ్రిని ప్రిన్సిపాల్ అభినందించారు. అధ్యాపకులు వదనగిరి, మల్లేష్, శాంతారావు, రాంప్రసాద్, రవి, తదితరులు పాల్గొన్నారు.

కళ తప్పిన బడులు

- తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- ఇంకా అందని యూనిఫాంలు
- ఆందోళనలో తల్లిదండ్రులు



నలుగురే విద్యార్థులు ఉన్న కొత్తపేట పాఠశాల

రణస్థలం: పేద విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ బడుల్లో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు. నాడు - నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. జగనన్న విద్యా కానుక, గోరుముద్ద వంటి కార్యక్రమాలతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివేందుకు ఆసక్తి చూపించేలా మార్పులు చేశారు. అత్యంత అధునిక పరికరాలతో మరుగుదొడ్ల నిర్వహణ, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు చూసి పాఠశాలల్లో విద్యార్థుల చేరిక ఘననీయంగా పెరిగింది. అయితే గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రభుత్వ బడుల నిర్వహణ గాలికి వదిలేయడంతో విద్యార్థుల సంఖ్య 20 శాతానికి పైగా పడిపోయింది. ఇటీవల మూడు కిలోమీటర్ల లోపు ప్రభుత్వ బడులు విలీనం చేయడం, ఉపాధ్యాయులు లేకపోవడం, మౌలిక వసతుల కల్పన, విద్యా కానుకలు అందజేయకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు బడుల వైపు వెళ్లిపోతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో విద్యార్థుల సంఖ్య...

మండలం	పాఠశాలలు	2024-25	2025-26 (ఇప్పటివరకు..)
రణస్థలం	108	7,650	6,670
లావేరు	85	5,210	4,876
ఎచ్చెర్ల	106	8,041	7,554
జి.సిగడాం	63	4,900	4,630

చేరని విద్యా కానుకలు

ప్రస్తుతం బడులు ప్రారంభమై వారం రోజులు కావస్తున్నా నేటికీ విద్యా కానుకలు పాఠశాలలకు సక్రమంగా చేరలేదు. బ్యాగులు, పుస్తకాలు, సాక్స్‌లు అరకొరగానే పాఠశాలలకు చేరాయి. జగనన్న విద్యా కానుకలకు బదులుగా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లుగా పేరుమార్చినా ఆ దిశగా పాఠశాలలకు కిట్స్ చేరకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు గందరగోళంలో ఉన్నారు. ఈలోగా ఉపాధ్యాయుల బదిలీలతో ప్రభుత్వ బడుల నిర్వహణ అగమ్యగోచరంగా మారింది.

ప్రైవేటు బాట పడుతున్నారు



వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య ఘననీయంగా పెరిగింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యార్థులకు సక్రమంగా మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు బాట పడుతున్నారు.

– బవిరి రమణ, సర్పంచ్, జేఆర్‌పురం

వారం రోజుల్లో రావచ్చు



ప్రస్తుతం పాఠశాలలకు పుస్తకాలు అన్నీ వచ్చాయి. యూనిఫారంలు, షూలు ఇంకా రాలేదు. మరో వారం రోజుల్లో రావచ్చు. ఇంకా పూర్తి సమాచారం లేదు.

– ఎ.త్రినాథరావు, ఎంఈవో, రణస్థలం

కూటమి పాలన అంతా మోసమే



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కూటమి నాయకులు

శ్రీకాకుళం రూరల్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఏడాది కాలంగా ప్రజలను మోసం చేస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఈ మేరకు శ్రీకాకుళం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వెన్నుపోటు పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. సీఎం చంద్రబాబు నాయుడు అన్నివర్గాల ప్రజలను మోసగించి హాయిగా అధికార దర్పాన్ని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రశ్నించే మీడియాపై అక్రమ కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రజలందరికీ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు తెలుసునని, రానున్న రోజుల్లో సమాధానం చెప్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ తూర్పు కాపు, కళింగ వైశ్య కుల రాష్ట్ర అధ్యక్షులు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ స్వరూప్, జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు రౌతు శంకరరావు, గార మండల ఎంపీపీ గొండు రఘురాం, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మార్పు పృథ్వీ, నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, పార్టీ సీనియర్ నాయకులు అంబటి శ్రీనివాసరావు, వైవీ శ్రీధర్, ఎన్ని ధనుంజయరావు, పొన్నాడ రుషి, బుక్కూరు ఉమామహేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ చిట్టి జనార్దనరావు, చల్ల రవి, మూకళ్ల తాతబాబు, తంగుడు నాగేశ్వరరావు, భైరి మురళి, రౌతు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

• గణపతి హోమం



పాత శ్రీకాకుళంలో ధర్మశాస్త్ర దేవాలయం ప్రాంగణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గణపతి హోమం బుధవారం చేపట్టారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర నామార్చనలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

పరామర్శ



రణస్థలం: లక్ష్మంనాయుడును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని చిల్లపేటరాజాం గ్రామానికి చెందిన విశ్రాంత వీఆర్వో చిల్ల లక్ష్మంనాయుడు భార్య బోడమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. ఆయనతో పాటు సర్పంచ్ కంబపు నర్సింహులు, ఎంపీటీసీ ఆళ్ల రాంభూపతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొంతాల లక్ష్మణరెడ్డి, కురిమిన గోవింద, సీరపు అప్పారావు తదితరులు ఉన్నారు.



గార: కాలిపోయిన నగదును పరిశీలిస్తున్న ఎంపీపీ రఘురామ్

గార: మండలంలోని కొర్లాం గ్రామానికి చెందిన కొర్లాపు అప్పన్న పూరిల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోవడంతో ఆ కుటుంబ సభ్యులను ఎంపీపీ గొండు రఘురామ్ బుధవారం పరామర్శించారు. ప్రమాదం జరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రూ.లక్ష నగదు కాలిపోవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయనతో పాటు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పీస గోపి, సర్పంచ్ పీస శ్రీహరిరావు తదితరులు ఉన్నారు.

రెండు రోజులు కుళాయిలు బంద్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో బలగ బుచ్చిపేటలోని ప్రధాన నీటి సరఫరా పంపింగ్ పైప్‌లైన్‌కు సంబంధించి పాలకొండ రోడ్డులో మరమ్మతులకి గురవ్వడంతో ఈనెల 20, 21వ తేదీల్లో వాటర్ సరఫరా నిలిపివేయనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 1 నుంచి 50 డివిజన్లు, విలీన 7 పంచాయతీల్లోని ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

రణస్థలం: మండలంలోని పైడి భీమవరం సబ్‌స్టేషన్ నిర్వహణ, ఇతర మరమ్మతుల నిమిత్తం సబ్‌స్టేషన్ పరిధిలో నారువ, మెంటాడ, వరిసాం, పైడి భీమవరం పంచాయతీ గ్రామాలకు ఈనెల 20వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని, ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.

బాధ్యతల స్వీకరణ



గణేష్ పట్నాయక్

జి.సిగడాం: స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా గణేష్ పట్నాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన జలుమూరు మండలంలోని మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి బదిలీపై వచ్చారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లెంక సాలూరు మోడల్ పాఠశాలకు బదిలీపై వెళ్లారు. గణేష్ పటాన్యక్ మాట్లాడుతూ అందరి సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేయడంతోపాటు ఉత్తమ ఫలితాలను సాధిస్తామన్నారు.



వైవీఎల్ అన్నపూర్ణ

గార: మండలంలో కె.మత్స్యలేశం పంచాయతీలోని కళింగపట్నం కోకావారి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వైవీఎల్ అన్నపూర్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె అనకాపల్లి జిల్లా వడ్డాయి కళాశాల నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన కె.అప్పలరాము హిరమండలం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. ప్రిన్సిపాల్‌ను లెక్చరర్లు, సిబ్బంది అభినందించారు.

రూ. 81 వేల ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

ఇచ్ఛాపురం రూరల్: కేధారిపురం గ్రామానికి చెందిన గిరిధర శెట్టి కుమారుడు రాజేష్ శెట్టి ఇటీవల మృతి చెందాడు. ఎదిగొచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు పుట్టెడు శోకంలో మునిగిపోయారు. పేదరికంతో బాధపడుతున్న ఆ కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలబడ్డారు. గ్రామస్తులు, మృతుని స్నేహితులు రూ.51,200, కేధారిపురం గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు రూ. 30 వేలు సేకరించారు. మొత్తం 81,200 రూపాయలను మృతుని తండ్రి గిరిధర్ శెట్టికి బుధవారం అందజేసి ఔదార్యాన్ని చాటారు.

విద్యార్థులకు కిట్స్ అందజేత



విద్యార్థులకు కిట్స్ అందజేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్స్‌ను బుధవారం సర్పంచ్ బుడారి లక్ష్మణరావు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేష్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, పీఎంసీ చైర్మన్ కోడిగుడ్ల దివ్య, హెచ్ఎం వి.విష్ణు, ఉపాధ్యాయులు శారద, శ్రీరామదత్త, బీవీ సత్యనారాయణ, నాయకులు బాలబొమ్మ చిన్నబాబు, డి.రామకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రైవేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ తగిన ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఏపీయూడబ్ల్యూజే, స్వామ్నా జిల్లా నాయకత్వం అభ్యర్థించింది. బుధవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలో ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారుల ద్వారా ప్రైవేటు విద్యాసంస్థలకు తగిన ఆదేశాలు జారీ చేయించారని గుర్తుచేస్తూ, ఆయా జిల్లాల కలెక్టర్లు ఇచ్చిన ఆదేశాల ప్రతులను వినతిపత్రంతో జత చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని డీఆర్వో వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారు. ఆయనను కలిసినవారిలో ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ జగదీష్, స్వామ్నా జిల్లా అధ్యక్షుడు సున్నం చిన్నారావు, గరిమెళ్ల ప్రెస్‌క్లబ్ కార్యదర్శి ఎస్.నవ చైతన్య, కోశాధికారి చౌదరి సత్యనారాయణ ఉన్నారు.

కోర్టుకు హాజరైన అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పశు సంవర్ధకశాఖలో గతంలో జరిగిన రూ.11 కోట్ల ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల దుర్వినియోగం, అవినీతిపై బుధవారం సంబంధిత అధికారులు కోర్టుకు హాజరయ్యారు. సుమారుగా రూ.11 కోట్ల ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు, పశువుల దాణా, నకిలీ అసోసియేషన్ పేరిట అవినీతి జరిగినట్లు జేఎఫ్ఎంసీ కోర్టు సీసీ 271/2025తో కేసు కోర్టులో నమోదైంది. ఈ కేసును పిటిషనర్ డాక్టర్ సూర్యం వేశారు. తగు ఆధారాలు ఉన్నందున కోర్టు ఈ పిటిషన్‌ను స్వీకరించి విచారణకు పిలిచింది. కోర్టు ఆదేశాల మేరకు సంబంధిత 11 మంది పశు సంవర్ధక శాఖ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు కోర్టుకి హాజరయ్యారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఆమదాలవలస: మండలంలోని చిట్టివలస గ్రామంలో గల అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు, వేదపండితులు రామాపంతుల వెంకట గోపాల శర్మ, చైతన్యశర్మ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఆలయ ఆవరణలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ పూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియట్ విద్యలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తూ, వివిధ కారణాలతో డిస్టర్బ్ అయిన కాంట్రాక్ట్ లెక్చరర్ల(సీఎల్స్) కౌన్సెలింగ్ పర్వం ముగిసింది. రేషనలైజేషన్ కారణంగా ఏర్పడిన రీడిప్లెడ్‌తో పాటు జూనియర్ లెక్చరర్ల బదిలీల కారణంగా డిస్టర్బ్ అయిన కాంట్రాక్ట్ లెక్చరర్లకు జోన్-1 పరిధిలో మంగళవారం కౌన్సెలింగ్ పూర్తి చేశారు. వీరంతా బుధవారం వారు ఎంపిక చేసుకున్న కాలేజీల్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ కౌన్సెలింగ్‌లో శ్రీకాకుళం నుంచి 29 మంది డిస్టర్బ్ కాగా, వారిలో 24 మంది సొంత జిల్లాలోనే పలు కాలేజీలను ఎంపిక చేసుకున్నారు. మిగిలిన ఐదుగురు పొరుగు జిల్లాలను ఎంచుకున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ స్థానాలపై గురి

ఇదిలా ఉంటే కొత్తగా గెస్ట్ ఫ్యాకల్టీలు పనిచేస్తున్న స్థానాలపై కొంతమంది కాంట్రాక్ట్ లెక్చరర్లు కన్నేసి, వివిధ రూపాల్లో ఆ స్థానాల్లో చేరిపోయేందుకు యథేచ్ఛగా పైరవీలకు పాల్పడుతున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ముఖ్యంగా కూటమి ప్రభుత్వ నాయకులు, ఆర్జేడీ కార్యాలయంలో అధికారులు, కీలక ఉద్యోగులతో తీవ్రంగా మంతనాలు జరుపుతున్నట్లు సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు ఇంటర్ విద్య ఉన్నతాధికారులకు చేరడంతో కాంట్రాక్ట్ లెక్చరర్ల బదిలీలంటూ ఏమీ లేవని, డిస్టర్బ్ అయినవారికి మాత్రమే పోస్టింగులు ఇచ్చామని తెలిపినట్లు సమాచారం. తాజాగా జేఎల్స్, సీఎల్స్ బదిలీలు కారణంగా తమ స్థానాలను పోగొట్టుకుని డిస్టర్బ్ అయిన గెస్ట్ ఫ్యాకల్టీలకు ఈ రెండు మూడు రోజుల్లో కౌన్సెలింగ్ చేసి పోస్టింగులు ఇచ్చేందుకు షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. అవి మినహా కొత్తగా కాంట్రాక్ట్ లెక్చరర్లకు ఎలాంటి బదిలీలు చేపట్టినా, సదరు ఆర్జేడీలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఇంటర్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా హెచ్చరించినట్టు తెలిసింది. అధికారులతో జరిపిన వీసీ కాల్‌లో సైతం ఇదే విషయమై డైరెక్టర్ స్పష్టం చేశారని అధికారులు సైతం ధ్రువీకరిస్తున్నారు.

జాబ్‌మేళాలో 25 మంది ఎంపిక



ఎంపికైన అభ్యర్థులతో కళాశాల అధికారులు, సంస్థ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన కరువైంది. జాబ్‌మేళాకు కేవలం 50 మంది మాత్రమే హాజరుకాగా.. వీరిలో అర్హులైన 25 మందిని ఎంఎస్ఎన్ లేబరేటరీస్ వారు ఎంపిక చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు పేర్కొన్నారు. వీరికి నియామక పత్రాలను అందజేశారు. జేకేసీ కో–ఆర్డినేటర్ వై.మణికుమార్, అధ్యాపకులు ఎంవీఎస్ సత్యనారాయణ, శ్రీనివాస్‌పాత్రో, సూరిబాబు, వెంకటరావు, ఎంఎస్ఎన్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



ఖగోళ భౌతిక శాస్త్రం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీరాములు

పాతపట్నం: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు అన్నారు. డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం విభాగాధిపతి పి.కామేశ్వరరావు రచించిన ఖగోళ భౌతిక శాస్త్రం పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఖగోళం ఏర్పడిన విధానం, గ్రహణం, ఉల్కలు, నక్షత్ర గమనం, తదితర విషయాలను పుస్తకంలో పొందుపరిచారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండాల చక్రపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిందితులను గుర్తించాలి



కూర్మ గ్రామాన్ని సందర్శించిన బీజేపీ నాయకులు

హిరమండలం: మండలంలోని కూర్మ గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదం ఘటనలో నిందితులను గుర్తించి, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని బీజేపీ నాయకులు కోరారు. కూర్మ గ్రామాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తుజేశ్వరరావు బుధవారం సందర్శించారు. అక్కడ ఉన్న కృష్ణ భక్తులను కలిసి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.